సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



మహిమాన్వితం.. సాయి పుణ్యక్షేత్రం 8లో ▸

నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయం మహిమాన్వితం.. సాయి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.

నేడే రథోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 12న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా నిత్యం శ్రీసత్యభామ రుక్మిణి సమేత గోపాలకృష్ణునికి ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేడు సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. సోమవారం నుంచి జాతర మొదలవుతుందని మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
27.0/13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి, వేకువజామున చలి ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

నేడు బోథ్ ఎమ్మెల్యేతో ఫోన్ ఇన్



అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్‌తో 'సాక్షి' ఆధ్వర్యంలో ఆదివారం ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చు.

డయల్ చేయాల్సిన నంబర్ :
83281 58609
సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు



గజ గజ..

- జిల్లాను వణికిస్తున్న చలి
- పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

కైలాస్‌నగర్: జిల్లాను చలి వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. శనివారం 11.7డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉదయం, సాయంత్రం వేళ్లలో చలి ప్రభావం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఆదివాసీ పల్లెలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జనం గజగజ వణుకుతున్నారు. పాల వ్యాపారులు, పేపర్ బాయ్‌లు, వాహనడ్రైవర్లతో పాటు ఉదయం కార్యకలాపాలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు ఉన్ని దుస్తులు ఆశ్రయిస్తున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు చలి తీవ్రత పెరిగినందున చిన్నారులు, వృద్ధులతో పాటు అస్తమా రోగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరంగా బయటకు వెళితే జాగ్రత్తలు తప్పనిసరి అని పేర్కొంటున్నారు.

జిల్లాలో వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	గరిష్ట	కనిష్ట
10	29.3	13.7
11	30.0	12.7
12	30.0	13.7
13	30.8	14.0
14	30.3	13.7
15	29.3	12.0
16	29.3	11.07

న్యూస్‌రీల్

నేడు బీజేపీ ఉమ్మడిజిల్లా సమావేశం

- హాజరుకానున్న సునీల్‌బన్సల్

నిర్మల్:భారతీయ జనతాపార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్మల్ పట్టణంలోని భైంసారోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షతోపాటు రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులు, నాలుగు జిల్లాల బాధ్యులు హాజరు కావాలని కోరారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధులను చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషకుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. విద్యా ప్రమాణాల పెంపునకు విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను వివరించారు. పదో తరగతి విద్యార్థులకు రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు పరీక్షలు నిర్వహించాలన్నారు. అత్యుత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, హెచ్‌ఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: యాసంగిలో సాగు చేస్తున్న రైతులు పంట సాగు వివరాలను ఏఈవోల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామ శివారు వద్ద ఆన్‌లైన్‌లో పంటల వివరాల నమోదును శనివారం ఆయన పరిశీలించారు. ప్రతీ రైతు సర్వేనంబర్, సాగు చేస్తున్న వివరాలను సంబంధిత ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి అష్రఫ్, ఏఈవోలు రవి, ప్రసాద్, శివచరణ్, తదితరులున్నారు.

ఇటీవల కలెక్టర్ రాహుల్‌రాజ్ బోథ్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో విద్యార్థులు తరగతి గదిలో కాకుండా బయట కాలక్షేపం చేస్తూ కనిపించారు. ఈ విషయంపై ఆరా తీయగా ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయని దృష్టికి వచ్చింది. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థులకు సిలబస్ పూర్తి కాకుంటే ఎలాగని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. దీంతో విద్యాశాఖ అధికారులు మరోసారి సర్దుబాటుకు శ్రీకారం చుట్టారు.



డీఈవో కార్యాలయం

- విద్యాశాఖలో ఈ ఏడాది రెండో సారి..
- తాజాగా 56 మంది ఎస్‌ఏలు, 43 మంది ఎస్జీటీలకు..
- ఎస్సెస్సీ పరీక్షల దృష్ట్యా నిర్ణయం
- 'ప్రాథమిక' విద్యార్థులకు తిప్పలే!

మళ్లీ సర్దుబాటు..!

ఆదిలాబాద్‌టౌన్: టీచర్ల సర్దుబాటు ప్రక్రియ మళ్లీ చేపడుతున్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడంలో దేశంలోనే వెనుకబడిన జిల్లాల్లో ఆదిలాబాద్ ఉండడంతో ప్రత్యేక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేశారు. చదువులు గాడిన పడుతున్న సమయంలో మరోసారి ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడంతో కథ మళ్లీ మొదటికొచ్చే పరిస్థితి ఎదురవుతోంది. కేవలం పదో తరగతి విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ సర్దుబాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు 149 వరకు ప్రస్తుతం ఉపాధ్యాయుల అవసరం ఉందని అధికారులు గుర్తించారు. 99 మంది టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించే పనిలో నిమగ్నమయ్యారు.

మరోసారి..

ఉపాధ్యాయుల కొరత కారణంగా జూలైలోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. 122 టీచర్లను అవసరం ఉన్నచోటకు సర్దుబాటు చేశారు. బదిలీల కారణంగా 122 మంది నుంచి 58 మందికి బదిలీలు జరిగాయి. ప్రస్తుతం 64 ఉన్నత పాఠశాలల్లో దాదాపు 149 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. పదో తరగతి విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తాజాగా డీఈవోను ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి, మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించి ఖాళీల వివరాలు సేకరించారు. ఆగమేఘాలపై అవసరమున్న పాఠశాలలకు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అవసరానికి మించి ఉన్న ఉపాధ్యాయులను సంబంధిత మండల పాఠశాలలకు కేటాయించనున్నారు. 56 మంది స్కూల్ అసిస్టెంట్లను, 43 మంది ఎస్జీటీలను సర్దుబాటు చేశారు. దీనికి సంబంధించి సోమవారం ఉత్తర్వులు జారీ కానున్నట్లు తెలుస్తోంది. తెలుగు మీడియం ఉన్నత పాఠశాలల్లో 67 మందిని, ఉర్దూ మీడియంలో 7, మరాఠీ మీడియంలో 24, హిందీ మీడియం పాఠశాలల్లో 1 చొప్పున కేటాయించారు.

ప్రాథమిక పాఠశాలల్లో తప్పని తిప్పలు..

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కారణంగా జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తిప్పలు తప్పేటట్లు కనిపించడం లేదు. ఇదివరకే స్పోర్ట్స్ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను కేటాయించారు. చాలా పాఠశాలల్లో ఒకరిద్దరితోనే చదువులు కొనసాగుతున్నాయి. రెండు తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నట్లు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు, నలుగురు టీచర్లు ఉన్న పాఠశాలల నుంచి సర్దుబాటు చేసి ఉన్నత పాఠశాలలకు పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఈ ప్రభావం విద్యార్థుల చదువులపై పడనుందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. పదో తరగతి విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స ర్దుబాటు ప్రక్రియను చేపడుతున్నాం. సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించేందుకు ఈ ని ర్ణయం తీసుకోవడం జరిగింది. అవసరానికి మించి పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం.

– ప్రణీత, డీఈవో

పునరాలోచించాలి..

జూలైలోనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. మరోసారి ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు టీచర్లను సర్దుబాటు చేయడం సరికాదు. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్య కుంటు పడుతోంది. సర్దుబాటు విషయంలో అధికారులు పునరాలోలించాలి. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతోనే అవసరమైన సబ్జెక్టులు బోధిస్తే ఇబ్బందులుండవు.

– గడుగు నరేందర్, ఎస్జీటీ సంఘం అధ్యక్షుడు

సద్దుమణిగిన వివాదం



వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జూడాల సంఘం అధ్యక్షుడు అరుణ్

- రిమ్స్ డైరెక్టర్ హామీతో మెడికోల ఆందోళన విరమణ
- ఆదివాసీల ఆరోగ్యం దృష్ట్యా విధుల్లోకి.. : జూడాలు

ఆదిలాబాద్‌టౌన్: మూడు రోజులుగా అట్టుడికిన రిమ్స్ వైద్య విద్యార్థుల ఆందోళన ఎట్టకేలకు సద్దుమణిగింది. జూడాలు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రిమ్స్ వైద్యులు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సమావేశమయ్యారు. అత్యవసర సేవలకు జూనియర్ డాక్టర్లు హాజరుకాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆందోళనతో వైద్యసేవలు నిలిచిపోవడంతో అవస్థలు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు స్పందించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు ఆదివాసీలు ఎక్కువ మొత్తంలో రావడం జరుగుతుందని, ఈ దృష్ట్యా తాము విధుల్లో చేరేందుకు ఒప్పుకున్నారు. అయితే కొంత మంది జూడాలు, మెడికోలు తమ సమస్యలు పరిష్కరించాలని షరతులు పెట్టారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత రిమ్స్ డైరెక్టర్‌తో దాదాపు గంటకు పైగా చర్చించారు. ఆ తర్వాత విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

డైరెక్టర్ హామీతో..

రిమ్స్‌లో బయట వ్యక్తులు వైద్య విద్యార్థులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని జూడాల సంఘం అధ్యక్షుడు అరుణ్ పేర్కొన్నారు. ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్‌ను విధుల్లో నుంచి తొలగించారని, దాడికి పాల్పడిన వారిని రిమాండ్ చేశారని తెలిపారు. భవిష్యత్తులో ఎప్పుడు కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను విధుల్లోకి తీసుకోవద్దని, రిమ్స్‌లో సెక్యూరిటీని మరింత పెంచాలని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం వసతిగృహం విద్యార్థులకు సరిపోవడం లేదని, మూడో అంతస్తు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గర్ల్స్ హాస్టల్ వెనుక భాగంలో చిన్నగా ఉన్న ప్రహరీ ఎత్తు పెంచాలన్నారు. దీంతోపాటు ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. డైరెక్టర్ ఇచ్చిన హామీ మేరకు సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, లేకుంటే తిరిగి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే విచారణ కమిటీ నివేదిక తమకు అనుకూలంగా రానట్లయితే మళ్లీ నిరసనకు దిగుతామని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులు క్రమశిక్షణతో ఉండే విధంగా చూస్తామని తెలిపారు. విజిటర్ రికార్డు ఏర్పాటుతో పాటు క్యాంటీన్ ప్రారంభించాలని తదితర సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. ఆ తర్వాత రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. ఈ దాడి తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ సంఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వైద్య విద్యార్థులంతా తన కుటుంబ సభ్యుల్లాంటి వారన్నారు. ఏ విద్యార్థికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ఇప్పటికే పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సెక్యూరిటీతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.



ఎఫ్ఐఆర్ కాపీని వైద్య విద్యార్థులకు అందజేస్తున్న టూటౌన్ పోలీసులు

ఆ అటెండర్లు విధులకు రాలే

- ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఉంటేనే అనుమతిస్తామన్న హెచ్‌ఎంలు



'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: 'ఉత్తుత్తి నియామకాలు' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టి)తో పాటు మావల మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో ఓ స్వచ్ఛంద సంస్థ అటెండర్లను నియమించింది. ఈ పాఠశాలలతో పాటు మరికొన్ని పాఠశాలలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వీరిని నియమించినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం 'నిరుద్యోగులకు స్వచ్ఛంద సంస్థ టోకరా..' పేరిట కథనం ప్రచురితం కావడంతో ఆ పాఠశాలలకు కేటాయించిన వారు విధులకు హాజరు కాలేదు. డీఈవో నుంచి ఉత్తర్వులు తీసుకొస్తేనే విధుల్లోకి తీసుకుంటామని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్పష్టం చేయడం గమనార్హం.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎంపీ సోయం, కలెక్టర్ రాహుల్‌రాజ్

- ఎంపీ సోయం బాపూరావు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. భారత్ సంకల్ప వికాసిత్ యాత్ర ప్రచార రథాలను కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లాకు ఆరు ప్రచార వాహనాలు కేటాయించిందన్నారు. వాటి ద్వారా గ్రామ, గ్రామాన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 2024 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ ఆవిష్కరించారు.అధికారులు, నాయకులతో వికాసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఎస్.కిషన్, బీజేపీ నాయకులు వి.ఆదినాథ్ పాల్గొన్నారు.

చింతగూడలో..

బోథ్: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరికీ అందిస్తామని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని చింతగూడలో వికాస భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం ఆయన పాల్గొని పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, సహకార బ్యాంక్ మేనేజర్ శైలజ గ్రా మస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే రైతుబంధు కట్

- విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: గంజాయి సాగు చేసే వారికి రైతుబంధుతో పాటు ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని కలెక్టర్ రాహల్‌రాజ్ అన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లాస్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గంజాయి సాగు, మత్తు పదార్థాలు రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి స్మగ్లర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి గంజాయి విక్రయదారులను, సాగు చేసే వారిని నియంత్రిస్తున్నట్లు పేర్కొన్నారు. గతేడాది 27 కేసుల్లో 64 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.67,64,793 విలువ గల 291 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయిపై ఎలాంటి సమాచారాన్నైనా పోలీసు యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. ఈ మత్తు పదార్థానికి బానిసైన వారి తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ అందిస్తున్నామన్నారు. గడిచిన ఆరునెలల్లో జిల్లా వ్యాప్తంగా గంజాయి సాగు చేస్తున్న 38 మందిని అరెస్టు చేశామన్నారు. అలాగే 20 కేసులు నమోదు చేసి 133 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా 275 మొక్కలను ధ్వంసం చేసినట్లుగా పేర్కొన్నారు. అనంతరం గంజాయి రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. ఇందులో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎఎస్పీ సమయ్‌జాన్ రావు, ఆర్డీవోలు స్రవంతి, జీవాకర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీత, రాథోడ్ రమేశ్, శంకర్, డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

కైలాస్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందేలా శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవితో కలిసి జిల్లాలో జిల్లాలో నమోదైన కేసుల స్థితిగతులపై సమీక్షించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో 47 కేసులు నమోదు కాగా 17పెండింగ్ ట్రయల్‌లో, 25 విచారణలో ఉన్నాయని, ఐదు కేసులు పరిష్కరించినట్లుగా తెలిపారు. బాధితులకు రూ.24,12,500 పరిహా రం అందించామన్నారు. కేసులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయవద్దని పెండింగ్‌లో ఉన్నవాటిని రెండు రోజుల్లో జా రీ చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరి ష్కారానికి తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న న్యాయసేవలు, పరిహారంపై పూర్తి నివేదిక అందజేయాలని సంబంధిత శాఖల అధి కారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్సీడీవో సునీత కుమారి, ఉట్నూర్ ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, ఎంపీడీఓ తిరుమల, డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్



రామారావును అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో బయోసైన్స్‌శాఖలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శీలం రామారావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇకలాజికల్ ఇంప్లికేషన్స్ అండ్ కన్జర్వేషన్ స్ట్రాటజీస్ ఆఫ్ కొండగట్టు హిల్ ఫారెస్ట్ తెలంగాణ, ఇండియా అనే అంశంపై డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశాడు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఈ అంశంపై శీలం రామారావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న శీలం రామారావును డైరెక్టర్ సతీశ్‌కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు.

తొమ్మిది క్వింటాళ్ల పత్తి చోరీ



తలుపు పగులగొట్టిన దృశ్యం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో తరుచు దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు కిరాణ దుకాణాలు, వైన్స్ షాపులు, పాన్‌షాప్‌లు, రేషన్‌షాపుల్లో, ఇండ్లలో దొంగతనాలు జరిగిన ఘటనలు చూశాం. కానీ చివరకు ఆరుగాలం కష్టపడిన రైతు పండించిన పత్తిని సైతం చోరీ చేస్తున్న సంఘటనలు పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంటున్నాయి. పాత ఉట్నూర్‌కు చెందిన దూట భారతి ఇంట్లో నుంచి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు తొమ్మిది క్వింటాళ్ల పత్తిని ఎత్తుకెళ్లారని కౌలు రైతు గురిజాల శివన్న ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని శివన్న పత్తి పంట సాగుచేశాడు. సేకరించిన పత్తిని యజమాని భారతి ఇంట్లో ఉంచాడు. రెండో దఫా సేకరించిన అనంతరం అమ్ముకుందామనుకున్నాడు. ఈ లోగా దొంగలు పత్తిని ఎత్తుకెళ్లడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలప పట్టివేత



వాహనంలో తరలిస్తున్న టేకు చెక్కలు

కడెం: మండలంలోని గంగాపూర్ గ్రామం నుంచి శుక్రవారం బోలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను సమాచారం మేరకు నవాబ్‌పేట్ వద్ద పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో అనిత పేర్కొన్నారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.25వేలు ఉంటుందన్నారు. గంగాపూర్‌కు చెందిన గుగ్లావత్ అరుణ్‌కుమార్ బోలేరో వాహనంలో కింద భాగంలో చెక్కలు పెట్టి పై నుంచి వరిధాన్యం పోసి కడెం వైపు తరలిస్తున్నట్లు తెలిపారు.









రిమ్స్‌లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కుర్చీలు, వెలుగుతున్న లైట్లు

గాడితప్పిన రిమ్స్ సమయ 'పాలన'

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ వైద్య కళాశాల ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పూర్తిగా గాడి తప్పింది. రిమ్స్ జూనియర్ వైద్యులు ఆందోళన బాట పట్టడంతో సందట్లో సడేమియా అన్నట్లుగా కళాశాలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. శనివారం ఉదయం 10.35గంటలు దాటిన వివిధ చాంబర్లలోని కుర్చీలన్నీ ఖాళీగా ఉండడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కాగా కుర్చీల్లో ఎవరు లేకపోయినా ఫ్యాన్లు తిరుగుతూ, లైట్లు వెలుగుతూ విద్యుత్‌ను దుబారా చేయడం వారి నిర్వాకానికి నిదర్శనం.


- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మహిమాన్వితం...
సాయి పుణ్యక్షేత్రం

- మరో షిర్డీ మన కల్లూరు..
- నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం



ధుని మందిరం



ఆలయంలోని సాయిబాబా విగ్రహం

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయం మహిమాన్వితం.. సాయి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. నిర్మల్ నుంచి కల్లూరు శ్రీదత్త వెంకట సాయి మందిరం 28కిలోమీటర్ల దూరంలో ఉంది. దివంగత ప్రభాకర్ మహారాజ్ భక్తుల సహకారంతో 17ఏళ్ల కిందట రూ.కోటి 25 లక్షలు వెచ్చించి షిర్డీ తరహాలో ఆలయాన్ని నిర్మించాడు. నిర్మల్ నుంచి బాసర, షిర్డీ, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్, ధర్మపురి, కొండగట్టు, వేములవాడ వెళ్లే భక్తులు కల్లూరు సాయిబాబా ఆలయాన్ని ప్రత్యేకంగా దర్శించడం విశేషం.

ఆలయ విశిష్టతలు...

కల్లూరు గ్రామానికి చెందిన బుక లింబగిరి అనే భక్తుడు గుట్టపై ఉన్న మూడు పెద్ద బండరాళ్లను దత్త, వెంకట, సాయి కొలువై ఉన్నాడని పూజలు చేసేవాడు. గ్రామస్తులు ఆయన భక్తిని మెచ్చుకొని ఆలయాన్ని నిర్మించారు. భక్తుల కోరికలు నెరవేరాలని కోరుతూ దూరుడుబండ కింద నుంచి వెళ్తారు. సాయిబాబా ఆలయం పక్కనే శివనేశ్వర్, దత్తాత్రేయ, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ ఆలయాలున్నాయి. అలాగే ప్రతినిత్యం 200మంది వృద్ధులకు ఓ పూట అల్పాహారం, రెండు పూటల భోజనం పెడుతున్నారు. శివనేశ్వర్ స్వామి గురువు కోరిక మేరకు అయోధ్య మహారాజ్ కల్లూరు గుట్టపై 13ఏళ్లుగా తపస్సు కోసం ఉండిపోయారు. ఆయన ఉండేందుకు ప్రత్యేకంగా చీకటి గదిని 20అడుగుల లోతున నిర్మించుకున్నారు. 2004లో అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడే కన్నుమూశారు. ఈ ఆలయంలో 1983లో సికింద్రాబాద్‌కు చెందిన ఉమామహేశ్వర్ అనే భక్తుడు తన కోరిక నెరవేరడంతో నంద దీపాన్ని వెలిగించాడు. 40ఏళ్లుగా నంద దీపం నిరంతరాయంగా జ్వలిస్తూనే ఉంది. షిర్డీ తరహాలో ఆలయ అభివృద్ధికి కృషిచేసిన దివంగత ప్రభాకర్ మహారాజ్ ఆలయాన్ని రూ.7లక్షల వ్యయంతో నిర్మించారు. వేణుగోపాల్‌చారి ఎంపీగా ఉన్న 2001లో ఆలయ అభివృద్ధికి ఎంపీ కోటా కింద రూ.10 లక్షలు మంజూరు చేసి సామాజిక భవనాన్ని నిర్మించారు. నిర్మల్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి తమ తండ్రి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం రూ.10లక్షల వ్యయంతో భవన సముదాయం నిర్మించాడు. ఆలయంలో ప్రతినిత్యం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు..

మండలంలోని కల్లూరులో రెండో షిర్డీగా ప్రసిద్ధిగాంచిన సాయిబాబా ఆలయంలో ఈనెల 18 నుంచి 26 వరకు నిర్వహించే దత్త జయంతి ఉత్సవాలకు కల్లూరు దత్తగడ్ సేవా సమితి సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18న సోమవారం ఉదయం శ్రీ విఘ్నేశ్వర పూజ, శ్రీదత్త వెంకట సాయి దేవతల పూర్ణాభిషేక పూజలు, కలశ స్థాపన, శ్రీగురు చరిత్ర సాయిబాబా సత్ చరిత్ర, ఈ నెల 24న అఖండ సాయి నామ సప్తహ, పారాయణము ప్రారంభం, శ్రీమహా సుదర్శన యాగం, శ్రీవిఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, 25న దత్త మహా పూజ, శ్రీ గంగాధర్ గిరి మహారాజ్ కారేగాం గారిచే జరుపబడును, 26న ఉదయం శ్రీ సుదర్శన యాగం సమాప్తి, పూర్ణాహుతి, మధ్యాహ్నం శ్రీ దత్తాత్రేయ స్వామి జననం, డోలారోహణం, ఉపనయనం, గోపాల కాల, భిక్షాటన, తీర్థ ప్రసాదములు, మహా ప్రసాదం (బండార) నిర్వహిస్తారు. రాత్రి శ్రీ దత్తాత్రేయ స్వామి పల్లకి సేవ పాలుకా దర్శనం, దత్త, వెంకట, సాయి, సతీ అనసూయ మాత చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకెళ్తారు.

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి
- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఖేలో ఆదిలాబాద్ మొదటి సీజన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులకు కొదవ లేదన్నారు. వారికి సరైన శిక్షణ ఇస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. జిల్లాలోని క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా వంటి ప్రతిష్టాత్మకమైన క్రీడలను నిర్వహిస్తుందన్నారు. ఈ రకంగా జిల్లాలో సైతం ఖేలో ఆదిలాబాద్ పేరిట పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా క్రీడాకారుల సౌకర్యం నిమిత్తం జిల్లా కేంద్రంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేలా కేంద్ర క్రీడల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, అథ్లెటిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, పోటీల ఆర్గనైజర్ విజీయస్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిపాని వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన ఎన్‌క్వాస్



వైద్యసిబ్బందితో ఎన్‌క్వాస్ బృందం సభ్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌క్వాస్ బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ బృందం (ఎన్‌క్వాస్) సభ్యులు ప్రదీప్ కుమార్ చౌదరి, సు ప్రజాజ్యోతిరాయి వెల్‌నెస్ సెంటర్‌ను వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వసతులు పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలను సేకరించారు. వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యసేవల రికార్డుల నిర్వహణతో పాటు జాతీయ వైద్యసేవలను అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 14రకాల రికార్డుల నిర్వహణ, గర్భిణుల పరీక్షలు, ప్రసవాలు తదితర వాటిపై ఆరాతీశారు. పచ్చదనంతో పాటు పరిసరాలను సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివరాలను నమోదు చేసుకొని పైస్థాయి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. వారి వెంట వైద్యాధికారి స్వామి, హెల్త్ అసిస్టెంట్ నగేష్, సూపర్‌వైజర్ తులసీరాం, వైద్యాధికారి స్వామి, ఏఎన్‌ఎం సుజాత ఉన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, వసతి గృహాల్లో పనిచేస్తున్న పర్మినెంట్ కుక్, కామాటి, వాచ్‌మెన్, అటెండర్స్, డేలివేజ్, అవుట్ సోర్సింగ్ నాల్గో తరగతి ఉద్యోగుల సమావేశాన్ని ఈ నెల 18న కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమవావేశానికి ఐటీడీఏ పీవో, డీడీలు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. డీడీటీడబ్ల్యూ, డీటీవోలు హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లాలోని వసతి గృహాల్లో పనిచేస్తున్న వర్కర్లందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎస్ శ్రీనివాస్, రాంచందర్, రాజలింగు, వసంతు, తిరుపతి, భవాని, కమల బాయి ఉన్నారు.

కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



ప్రమోద్‌ను సన్మానిస్తున్న డయాగ్నోస్టిక్ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికల్లో కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన ఫార్మాసిస్టు నేరేళ్ల ప్రమోద్‌ను తెలంగాణ డయాగ్నోస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మాసిస్టులకు అండగా ఉంటూ ఫార్మసీ రంగంలో లోపాలను సరిదిద్దేలా కౌన్సిల్ ద్వారా ప్రయత్నిస్తూ ముందుకు మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీఏ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల హన్మంతు, ల్యాబ్ టెక్నీషియన్స్ జ్ఞానేశ్వర్, వెంకట్రావు, ముత్యం, వెంకట్ స్వామి, అభిషేక్, రమేష్, శివ, రమణ, వకీల్ పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న దృశ్యం



కాలిన పత్తి

నేరడిగొండ: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆకస్మాత్తుగా పత్తి కుప్పల్లో మంటలు చెలరేగడంతో మిల్లులో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అయితే రెండు రోజులుగా కొనుగోలు చేసిన పత్తి 2500 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పత్తి ఎంతవరకు నష్టం జరిగిందన్న అంచనా మాత్రం వేయాల్సి ఉంది. ప్రమాదవశాత్తు జరిగిందా.. కావాలనే ఎవరైనా చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సీసీఐ అధికారుల ను సంప్రదించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు.

ఠాణా ఎదుట శేజల్ నిరసన

తాండూర్: స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ఆరిజిన్ డైయిరీ సీఈవో బోడపాటి శేజల్ శనివారం నిరసన వ్యక్తం చేసింది. గతేడాది తాండూర్ పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించింది. తాండూర్ మండలానికి చెందిన రంగారావు, సతీష్‌రావు, హరిప్రియ, కుమ్మరి పోషం, చిల్లర సంతోష్ తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొంది. పోలీసులు ఏకపక్ష విచారణతో కేసుల్లో ఇరికించారని ఆరోపించింది. డెయిరీ నిర్వహణలో భాగంగా రైతులకు రూ.10 లక్షల విలువైన ఎనిమిది ఆవులు, రెండు గేదెలు ఇచ్చినట్లు తెలిపింది. తన ఫిర్యాదు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. కాగా, ఈవిషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. శేజల్ ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం కేసు నమోదు చేశామని, మళ్లీ అదే సమస్యపై ఫిర్యాదు చేయడానికి వచ్చారని, ఒకే అంశంపై రెండు ఫిర్యాదులు చేస్తే కేసు నమోదు చేయడం కుదరని తెలిపారు.

కస్తూర్బాలో సేంద్రియ సాగు..

- కూరగాయలు పండిస్తున్న విద్యార్థినిలు



తోటలో కూరగాయలు కోస్తున్న విద్యార్థినులు

జైనథ్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో సేంద్రియ సాగు విధానంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా ఆవు వ్యర్థాలు, వేప కషాయం వంటి సేంద్రియ ఎరువులు వాడుతూ వివిధ రకాల కూరగాయాలు పండిస్తున్నారు. దీంతో విద్యార్థులకు భోజనంలో తాజా కూరగాయలు అందడంతో పాటు సాగుపై కూడా అవగాహన పెంచడానికి అవకాశం ఉందని, పాఠశాల ప్రత్యేకాధికారిణి వీణ కుమారి తెలిపారు. ముఖ్యంగా సేంద్రియ సాగు, దానితో కలిగే లాభాలపై విద్యార్థినిలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కూరగాయల మినీ తోటలో టమాట, వంకాయ, మిర్చీ, చిక్కుడు, ఇతర ఆకు కూరలు లభిస్తుండడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు ప్రమాదం



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

సోన్: నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ 44వ జాతీయ రహదారిపై ప్రైవేటు పాఠశాల బస్సుకు శనివారం ప్రమాదానికి గురైంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన బస్సు ఉదయం విద్యార్థులను తీసుకెళ్లేందుకు సోన్ మండలం మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాలకు వెళ్లింది. విద్యార్థులను ఎక్కించుకుని నిర్మల్‌కు బయల్దేరింది. జాతీయ రహదారి మీదుగా కడ్తాల్ వద్దకు రాగానే లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా లారీ టైరు పేలింది. ఈ ఘటనలో టైరు స్కూల్ బస్సుకు తగలడంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే వారిని నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు.

రాగిజావలో పడి విద్యార్థినికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం విద్యార్థుల కు రాగిజాగ వండారు. అయితే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని కోంద్ర ప్రజ్ఞ ప్రమాదవశాత్తు వేడి రాగిజావ గంజులో పడిపోయింది. దీంతో విద్యార్థిని శరీ రంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించారు.

నిందితులను పట్టుకోవాలని వినతి



ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామంలో గతనెల క్రితం సామాజిక వర్గానికి చెందిన గంగాధర్ అనే రైతును హత్య చేసి బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులను వెంటనే పట్టుకుని కేసు నమోదు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు, కుటుంబీకులు శనివారం ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు బోల్సా గ్రామాన్ని సందర్శించి గంగాధర్ కుటుంబీకులను పరామర్శించారు. అయితే ఇటీవల మృతుడి కొడలికి అదే గ్రామానికి చెందిన పోతన్న అనే వ్యక్తి లైంగికదాడికి ప్రయత్నించాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నేటి వరకు ఆయనకు అరెస్టు చేయలేదన్నారు. బాధిత కుటుంబీకులను న్యాయం జరగని ఏడాల మానవ కమిషన్‌కు ఆశ్రయిస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి సురేందర్, శివయ్య, భూషి, శైలజ ఉన్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ సమీపంలో శనివారం రాత్రి గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మామడిగూడ గ్రామానికి చెందిన మడావి జైవంత్‌రావ్ మామిడిగూడ గ్రామం నుంచి మహారాష్ట్రలోని కిన్వట్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో రాంపూర్ సమీపంలో వాహనాల తనిఖీలో పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 100 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.